# ఫోటో

వాళ్ళిద్దరూ కలిసి ఫోటో తీయించు కుందామనుకున్నారు.

ఆమె 'సరే' నంది.

అతనూ 'సరే' నన్నాడు.

కాని ఫోటో తీయించుకోవడమెల్లా ?

ఆమె పరస్త్రీ — అతనితో కలిసి ఫోటో తీయించుకుంటే భర్త ఏమంటాడు?—లోకం ఏమంటుంది?

ఇద్దరూ ఆలోచించారు.

అతనికి ఏమీ పాలుపోలేదు.

తిరిగి యీమాటు కొంచెం తీవ్రంగా ఆలోచించాడు.

కాని బొత్తిగా లాభంలేకపోయింది.

ఆమెకి చప్పున ఒక ఆలోచన తట్టింది. చివరకి అదే సరి అయిన ఆలోచనని తోచింది.

ఈ ఆలోచనే ఆమె అతనితో చెప్పింది — అతను 'భేషుగ్గా' వుందన్నాడు.

చివరకి ఈ ఆలోచన ననుసరించి, వాళ్ళిద్దరూ కలిసి ఫోటో తీయించుకున్నారు.

* * *

ఆ సాయంత్రానికల్లా ఫోటో పూర్తిఅయి వచ్చింది.

'అబ్బా! ఎంత దగ్గరగా నుంచున్నామో చూడు?' అన్నాడు, అతను ఫోటోను దీర్ఘంగా పరికిస్తూ—

'రెండు శరీరాలు గట్టిగా ఒరుసుకుంటున్నాయి', అంది ఆమె అతని

కళ్ళల్లోకి కొంటెగా చూస్తూ, అప్పటికప్పుడే తనశరీరం పైన ఆ వొరుసుల్ని ఫీలవుతూ —

Responsive గా ఆతను సన్నగా చిరునవ్వాడు, ఆ వొరుసులకి కారణం తనేననికూడా గ్రహిస్తూ —

ఆమె హృదయం వికసించింది.

తృప్తిగా శరీరం గంతులువేసింది.

సంతోషాతిశయానికి తట్టుకోలేక ఆమె చివరికి, ఆతని చేతుల్లోకి వాలింది.

*　　*　　*

'ఈ ఫోటో చూచారా?' అంది ఆమె తనభర్తకి ఫోటో అందిస్తూ —

'ఈ పక్కనున్న అమ్మాయి ఎవరని' ప్రశ్నించాడు భర్త అమాయకంగా.

'నా స్నేహితురాల'ంది ఆమె జవాబుగా.

'ఈ మనిషిని నేనెన్నడూ చూచినట్టులేదే!' అన్నాడు భర్త ఆశ్చర్యసూచకంగా.

ఆమెభర్త ఆ పక్కనున్న అమ్మాయిని ఎరగడు

భర్తే కాదు—ఆ ప్రాంతాల్లో పక్కనున్న అమ్మాయిని ఎవ్వరూ ఎరగరు. కొద్దిరోజులక్రితమే ఆమె ఆప్రాంతాలకి ఏదో పనిమీదవచ్చింది. తలవనితలంపుగా ఆమె—ఆపక్కనున్న అమ్మాయి కలయిక సంభవించింది. జ్ఞాపకార్థం వాళ్ళిద్దరూ కలిసి ఫోటో తీయించుకున్నారు. ఆమె తన పని పూర్తిఅయినతరువాత, కలలోని వ్యక్తికిమల్లే అదృశ్యమైంది, ఆప్రాంతాలనించి—

"నేనెల్లాఉన్నానండీ?" అంది ఆమెభర్తని జవాబుకోసం పరికిస్తూ—

'Simple గా, చాలా అందంగా వున్నావ'న్నాడు భర్త క్లుప్తంగా—

'నా పక్కనున్న అమ్మాయి ఎల్లావుందండీ' అంది ఆమె మళ్ళీ భర్తని ప్రశ్నార్థకంగా చూస్తూ—

'అజిట్టూ—ఆమె, దయ్యానికిమల్లేవుందన్నా'డు భర్త టూకీగా—

'మొగాడికి ఆడవేషంవేసినట్లు వుంది కాదండీ' అంది ఆమె తిరిగి ప్రశ్నార్థకంగా—

'ఔ'నన్నట్లు భర్త అనాలోచితంగా తలూపాడు.

*     *     *

రెండు సంవత్సరాలు గడిచాయి.

ఈనాటివరకూ, ఆఫోటో, ఆమె పడకటింట్లో వేళ్ళాడగట్టి వుంది.

అప్పుడప్పుడూ ఆమెస్నేహితులు వచ్చి 'ఇదేమిటే, ఈ అమ్మాయి దయ్యానికిమల్లే వుందం'టారు, ఫోటోని తదేకధ్యాన్నంగా పరికిస్తూ—

'మొగాడికి ఆడవేషం వేసినట్లుందికదూ?'' అంటుంది ఆమె, స్నేహితులకి కొంటెగా బదులుచెపుతూ.